క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న ఆక్రితి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మగువుల మనసును దోచే వస్త్రాలతో ఎంజీరోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆక్రితి లైఫ్‌స్టైల్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలోని దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్ చీరలతో 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. బ్రైడల్ కలెక్షన్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అన్ని రకాల చీరలు, దుస్తులు, జ్యూవెలరీ, ఇతర కలెక్షన్స్, డిజైనర్ వస్త్రాలు, పార్టీవేర్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుందని నిర్వహకురాలు శశి మెహతా తెలిపారు.

రంజింప చేసిన ఆంధ్ర నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం ఆంధ్ర నృత్య ప్రదర్శన జరిగింది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. రాయన శ్రీనివాసరావు శిష్యబృందం పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, తీర్థప్రసాదాలను అందజేశారు.

దుర్గగుడి క్యూలైన్‌లో పాము కలకలం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి సర్వ దర్శనం క్యూలైన్‌లో శనివారం పాము కలకలం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో మహా మండపం 7వ అంతస్తు సర్వదర్శనం క్యూలైన్‌లో భక్తులు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో పాము కనిపించింది. భక్తులు భయంతో వెనక్కి తిరిగి రాగా, మరి కొంత మంది ముందుకు పరుగుపెట్టి టిక్కెట్ల స్కానింగ్ పాయింట్‌లో ఆలయ సిబ్బందికి పాము గురించి తెలిపారు. దీంతో ఆలయ, శానిటేషన్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై పామును కర్రకు ఎక్కించి, కిటికీలో నుంచి బయటకు పడేశారు. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ జీవితంలో వృద్ధాప్య దశ చాలా కీలకమైనదని, జీవితం చివరి దశలో ఉన్న వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఐదో ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.రాజారాం పేర్కొన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని అమ్మప్రేమ ఆదరణ సేవా సంస్థలో 'న్యాయ విజ్ఞాన సదస్సు' శనివారం జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృద్ధుల కోసం ఉన్న చట్టాలను వివరించారు. వృద్ధాశ్రమ సేవలను ఆయన కొనియాడారు. అనంతరం ఓ నిరుపేద కుటుంబానికి అమ్మ ప్రేమ ఆదరణ సేవా సంస్థ ఆర్థిక సహాయంతో అందించిన ఇస్త్రీ బండిని రాజారాం చేతుల మీదుగా బహుకరించారు. న్యాయ సేవా సంస్థ అధికారి పగిడిపల్లి రాము, అమ్మ ప్రేమ ఆదరణ సేవాసంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ట్రెజరర్ పి.నాగరాధిక, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర, పీఎల్‌వీ సాల్మన్ జయకుమార్, యశోద, ప్రమీల పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు స్వరాభిషేకం

విజయవాడకల్చరల్: హైదరాబాద్‌కు చెందిన గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘంటశాల శత జయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం అమృతగానం- అమృత స్వరం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. ఘంటసాల స్వరపరచిన, ఆయన గానం చేసిన గీతాలను హైదరాబాద్‌కు చెందిన బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, సాయి మేఘన, శిరీష కాకినాడకు చెందిన పీవీ రమణ ఆలపించారు. కార్యక్రమాలను పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు. కళాకారుల కృషిని అభినందించారు. గోకులం సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు వై.సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ప్రతీ నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాయకులు బాలకామేశ్వరరావు, పీవీ రమణలను నిర్వాహకులు సత్కరించారు.

ఆకలి తీరుస్తున్న అన్న సంతర్పణ సమితి ట్రస్ట్

- 2021లో ట్రస్ట్ ఏర్పాటు
- 180 మంది వ్యవస్థాపక సభ్యులు
- రోజుకు 400 మందికిపైగా అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న అన్నసంతర్పణ సేవా సమితి సభ్యులు(ఫైల్)

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనిషి మనుగడ ఆహారంపై ఆధారపడి ఉంది. భోజనం లేక ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నదానం జీవన్ముక్తికి సోపానం. జీవులకు తాను అన్నమై ఉన్నానని భగవద్గీతలో స్వయంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. అన్నార్తుల ఆకలి తీర్చడంతో ఆ పరమాత్ముడిని చేరడానికి సులువైన మార్గమని నమ్మి అన్న సంతర్పణ సమితి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు. ట్రస్ట్ ద్వారా కొన్ని వందల మందికి దాతలు, వలంటీర్లు సభ్యులుగా చేర్చి నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో 400 మందికిపైగా పేదలకు, భక్తులకు ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు.

తొమ్మిది మందితో ప్రారంభమై..

2021వ సంవత్సరం మే 23న కోవిడ్ సెకండ్ వేవ్‌లో కేవలం తొమ్మిది మందితో ప్రారంభమైంది. దాతలు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు, పెద్దలు జయంతి, వర్ధంతి ఇలా అనేక కార్యక్రమాలకి వారే స్వయంగా వచ్చి తమ స్వహస్తాలతో వేడి వేడి అన్నం, కూరలు వడ్డించి తృప్తిచెందుతున్నారు.

గురువు స్ఫూర్తితో..

రెండేళ్లుగా గుండు దిలీప్ గురువు చిత్ర స్టూడియోస్ అధినేత మద్ది వెంకట రామ మోహనరావు ఇచ్చిన ధైర్యంతో ప్రతి రోజు 100 మందికి అన్నం పెడదామని మొదలుపెట్టిన మహాయజ్ఞం ఈ రోజు అందరి సహాయంతో కొన్ని వందల మందికి అన్నం ప్రతిరోజూ పెడుతున్నారు. దాతల సహాయంతో వీలైనంత ఎక్కువ మందికి పూర్తి భోజనం అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. తన సొంత వ్యాపారాన్ని సైతం పక్కన పెట్టి ఈ సంస్థ పురోగతికి పూనుకున్నారు గుండు దిలీప్. వారి సేవలు మెచ్చి 180 మంది వ్యవస్థాపక సభ్యులుగా చేరడమే కాక, శ్రీదేవి సాంస్కృతిక సంఘం ద్వారా డొక్కా సీతమ్మ అవార్డు, ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్సిటీ, హోసూర్ గౌరవ డాక్టరేట్ అందించారు.

దుప్పట్లు, చెప్పుల పంపిణీ

వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, చెప్పులు అందజేస్తున్నారు. పిల్లలో నైపుణ్యత పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. త్వరలో అధునాతన సౌకర్యాలతో వంటశాల ఏర్పాటు చేసి ఇంకా ఎక్కువ మందికి భోజనం ఉచితంగా అందించటానికి కృషి చేస్తున్నట్లు దిలీప్ తెలిపారు.

దేశాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): దేశాభివృద్ధిలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని సివిల్ సప్‌లైస్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చార్టెడ్ ఎకౌంటెంట్స్ విజయవాడ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. చార్టెడ్ ఎకౌంటెంట్స్ తమ విభాగంలో మెరుగైన సేవలందించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరచటంలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ నిబద్ధతగా పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు తోడ్పాటు అందించాలని సూచించారు. విజయవాడ బ్రాంచ్ వరుసగా మూడో సారి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. విజయవాడ నూతన కమిటీ చైర్మన్‌గా వీర్ల నరేంద్ర బాబు, వైస్ చైర్మన్‌గా నిట్ట రవికిషోర్, కార్యదర్శిగా కంచమరెడ్డి నారాయణ, కోశాధికారిగా ఉప్పులూరి జయంత్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దక్షిణ భారత ప్రాంత చైర్మన్ పున్నారాజ్, సీఏలు ప్రసన్న కుమార్, శ్రీధర్, చిన్న మస్తాన్, సునీల్ కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఐసీఏఐ విజయవాడ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తాగునీరు అందించేందుకు నూతన పైప్‌లైన్లు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ కోటిరెడ్డి, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివిజన్ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఊర్మిళానగర్ 43వ డివిజన్‌లోని 126వ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెలంపల్లి సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు.

నియోజకవర్గానికి రూ.18 కోట్ల నిధులు

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు పొందిన వారికి సైతం పథకాలు మంజూరు చేసేందుకే ప్రజల వద్దకు వెళ్తున్నామని చెప్పారు. డివిజన్‌లో ఇప్పటికే కొన్ని రోడ్లను అభివృద్ధి చేశామని, మిగిలిన వాటిని మరికొద్ది రోజుల్లో అభివృద్ధి చేస్తామన్నారు. స్కేటింగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక అధికారులను నియమించి వాటన్నింటిని పరిష్కరించడంతో పాటు ఒక్కో సచివాలయానికి అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గానికి రూ.18 కోట్ల నిధులు వచ్చాయన్నారు. ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారన్నారు. నగర అభివృద్ధిని కూడా గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు.

సైకిల్ పోవాలని బాబే పిలుపు ఇచ్చారు

సైకిల్ పోవాలని సాక్షాత్తూ చంద్రబాబే టీడీపీ సభలో చెప్పారని, ఇక ఆ పార్టీకి ప్రజల్లో విశ్వాసం లేదని వెలంపల్లి అన్నారు. లోకేష్ పాదయాత్ర చేస్తుంటే చివరికి ఆపార్టీ కార్యకర్తలే ఆయన్ను గుర్తుపట్టడం లేదన్నారు. లోకేష్ పిల్లల వద్దకు వెళితే జగన్ మామ మంచి వాడని ఆ పిల్లలు చెబుతున్నారన్నారు. చంద్రబాబు పరిస్థితి మొరిగే కుక్క కరవదన్న సామెతలా ఉందన్నారు. పోలీసులు లేకుండా రావాలని సవాల్ విసిరే చంద్రబాబుకు నిజంగా దమ్ముంటే తన సెక్యూరిటీ లేకుండా రావాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్ను ఎర్రచేస్తే చంద్రబాబు కళ్లు తిరిగి పడుపోతాడని ఎద్దేవా చేశారు. నిరంతరం పోలీసుల సహాయం పొందుతూ వారిపై విరుచుకుపడటం సబబు కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో కూడా గెలవలేడన్నారు. చంద్రబాబు అరుపులకు ఎవరు భయపడరని, ఆయన పిచ్చి పిచ్చి సవాళ్లు మానుకోవాలని ఎమ్మెల్యే వెలంపల్లి హితవు పలికారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నగరపాలక సంస్థ, రెవెన్యు అధికారులు, పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మరింత విజ్ఞానం



గ్రీన్‌హౌస్‌ను పరిశీలిస్తున్న చిన్నారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని పొందుతారని పాతబస్తీలోని ప్రియదర్శిని హైస్కూల్ హెచ్‌ఎం సత్యవాణి అన్నారు. ప్రియదర్శిని హైస్కూల్ ఆవరణలో శనివారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. జీవన విధానం పర్యావరణాన్ని ఏ విధంగా నష్టపరుస్తుంది, దాని పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను విద్యార్థులు గ్రీన్‌హౌస్ పేరుతో నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే వివిధ భౌతిక, రసాయనశాస్త్ర అంశాలను చక్కగా ప్రదర్శించి ఆలోచింపజేశారు. అదేవిధంగా చిన్నారులు మానవుని అవయవాలు, వాటి పనితీరు, వాటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అంశాలను ప్రదర్శించారు. అదే విధంగా సమతుల్య ఆహారం తదితర అంశాలను సైతం చక్కగా వివరించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా చిన్నారులు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొనే విధంగా పలు అంశాలను అనేక అంశాలను ప్రదర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వాణీ హైస్కూల్ అధినేత మేకా కృష్ణశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ విద్యావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ హింస చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి బాలకోటేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): గృహ హింస చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి డి.బాలకోటేశ్వరరావు అన్నారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద గల ఓ హోటల్‌లో శనివారం గృహహింస చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా దిశ చట్టం ద్వారా యువతులకు భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చితే గృహ హింస, మహిళలపై వేధింపులు తగ్గాయని తెలిపారు. ఆధునిక సమాజంలో ఆడపిల్లలు విద్యావంతులుగా తమ ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. దీంతో మహిళలకు చట్టాలపై సైతం అవగాహన పెరిగిందన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ కె.సత్యవతి, ఎల్.ఎస్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలి



గిరిపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె శనివారం గిరిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, పిల్లలకు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వ్యాక్సిన్ నిల్వలు, సరఫరా, శీతలీకరణ నిర్వాహణ, వ్యాక్సినేషన్ రికార్డులు, లబ్ధిదారుల లిస్టులు పరిశీలించారు. అనంతరం నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ కేరియర్‌లో నిల్వ ఉంచడాన్ని పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేయించేందుకు వచ్చిన తల్లులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమీపంలోని గృహాలను సందర్శించి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయిస్తున్నారో, లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని, తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన దగ్గర నుంచి ఐదేళ్లు వచ్చే వరకూ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

4 నుంచి మహిళా ఉత్సవ్-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మార్చి 4 నుంచి 12 తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో మహిళా ఉత్సవ్-2023 నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. మహిళలు తయారు చేసిన ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ చీరలు, ఫ్యా షన్ డిజైనింగ్, టైలరింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బొమ్మల తయారీ మొదలైన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. మహిళా ఉత్సవ్‌లో తమ ఉత్పత్తులను విక్రయించాలనుకునే వారు ఈ నెల 28వ తేదీ మంగళవారంలోపు మొగల్రాజపురం, రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని తన తండ్రి కనిపించడం లేదంటూ ఓ కుమారుడు కొత్తపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం షాబాద్‌కు చెందిన చల్లా శేషయ్య(71) తన కుమారుడు ప్రసాద్ వద్ద ఉంటాడు. గతేడాది మార్చి 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి తిరిగి రాలేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మతిస్థిమితం లేని తన తండ్రి అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి వచ్చేవారని, ఈ దఫా రాలేదని ఆందోళన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మెషీన్ లెర్నింగ్‌పై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపేంద్రరావు, ఫాదర్ రవీంద్ర

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై అవగాహన కలిగి ప్రతిభావంతులుగా ఎదగాలని చిప్ ఎలక్ట్రానిక్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉపేంద్రరావు అన్నారు. ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మెషీన్ లెర్నింగ్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కరెంట్ ఎఫైర్స్‌ను తెలుకోవాలని సూచించారు. మెషీన్ లెర్నింగ్ వంటి సదస్సుల ద్వారా విద్యార్థులకు సంబంధిత అంశాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు.

విశ్లేషణాత్మక అవగాహన..

కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు సిద్ధాంతపరమైన అంశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. మార్కులే పరమావధిగా కాకుండా ఆయా అంశాలపై విశ్లేషణాత్మకంగా అవగాహన పెంచుకోవాలని వివరించారు. అనంతరం మెషీన్ లెర్నింగ్‌పై ప్రసంగించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో నిత్యం జరిగే ఇంటింటి చెత్తసేకరణ నిర్వాహణ విధానం పారదర్శకంగా చేపట్టాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన 4వ డివిజన్‌లోని ఎల్ఐసీ కాలనీ, ఫిలిం కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. పారిశుద్ధ్య నిర్వాహణకు ఎటువంటి అవరోధం లేకుండా క్లాప్ వాహనాల ద్వారా నివాసాల నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. డివిజన్ పరిసరాలు అన్నీ నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లో ఇటీవల పూర్తి చేసిన సీసీ రోడ్లను రీబౌండ్ హ్యామర్‌తో నాణ్యతను, రోడ్డు లోతు పరిమాణం నిబంధన ప్రకారం ఉన్నది లేనిది స్వయంగా పరిశీలించి వాటి బిల్లులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన జాతీయ రహదారి వెంబడి ఉన్న సెంట్రల్ డివైడర్ గ్రీనరీని పరిశీలించి మొక్కల మధ్యన ఉన్న గ్యాప్ ఫిల్లింగ్ చేసి ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

అక్కడి నుంచి ఆయన 19వ డివిజన్ పున్నమితోట ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన దోభీఖానా షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఏఎస్ఎన్ ప్రసాద్, ఉద్యానవన అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దినత్రయ చతుర్వేద మాస పారాయణం ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన ప్రజలు సుభిక్షంగా ఉండాలని అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీపీఠంలో దినత్రయ చతుర్వేద మాస పారాయణం శనివారం ప్రారంభమైంది. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వేద పండితులు శ్రీరుద్రమును పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్లపల్లి శివశర్మ శ్రౌతి తదితరులు పర్యవేక్షించారు.

వార్డు వలంటీర్లకు రేపు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ దశలో జరిగే ఈ ఎంపికలో 69 మంది వార్డు వలంటీర్లకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. వివరాలకు స్పెషల్ ఆఫీసర్(వార్డు సెక్రటరియట్స్), వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్, ఫోన్ నంబర్ 81859 33187లో సంప్రదించాలని సూచించారు.

ఏఎస్ఐ ప్రభాకరరావుకు నివాళి

విజయవాడస్పోర్ట్స్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఎస్ఐ దేవరపల్లి ప్రభాకరరావు మృతదేహానికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు నివాళులర్పించారు. విజయవాడ నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభాకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నెల 23న ఆయన మరణించారు. భవానీపురం జోజినగర్‌లో ప్రభాకరరావు నివాస గృహం వద్ద ఆయన మృతదేహాన్ని డీసీపీ సందర్శించి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25 వేల నగదును ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభాకరరావు నగరంలోని సత్యనారాయణపురం, వన్‌టౌన్, ఇబ్రహీంపట్నం, గవర్నర్‌పేట స్టేషన్‌లలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకరరావుకు నివాళులర్పించిన వారిలో ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతుండగా, వారికి దేవినేని నెహ్రూ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గంలోని 21వ డివిజన్‌కు చెందిన ఈశ్వరరావు, 11వ డివిజన్‌కు చెందిన భగవాన్ రాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ట్రస్ట్ ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 11వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.